

అపరిచిత ఫోన్‌కాల్స్‌తో జాగ్రత్త : ఎస్‌పి

ప్రజాశక్తి – ఏలూరు స్పోర్ట్స్

గుర్తుతెలియని వ్యక్తుల ద్వారా వచ్చిన అనుమానిత ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని, అటువంటి ఫోన్లు వచ్చిన పక్షంలో వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ స్పష్టం చేశారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రతి సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఈ సోమవారం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్‌తో పాటు జిల్లా అదనపు ఎస్‌పి సూర్యచంద్రరావులు సంయుక్తంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు ఫిర్యాదులు అందుకున్నారు. ఈ ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులతో ఎస్‌పి ఫోన్‌లో మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు పలు రకాలైన మార్గాలను సైబర్ నేరాల కోసం వినియోగిస్తున్నారని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

నీటి సంఘాల పోరుకు..

కౌంట్‌డౌన్..!

5న నోటిఫికేషన్, 8న ఎన్నికలు
11న డిస్ట్రిబ్యూటరీ, 14న ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు
ఏలూరు జిల్లాలో 2,31,311 మంది, పశ్చిమలో 3.29 లక్షల మంది ఓటర్లు
ఎన్నికల ఏర్పాట్లలో ఇరిగేషన్ అధికారులు నిమగ్నం

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి



సాగునీటి సంఘాల ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలైంది. ఇక ఎటువంటి ఆటంకాలూ లేకుండా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసే విధంగా ఇరిగేషన్ అధికారులు ముందుకు సాగుతున్నారు. నవంబర్ 21న జరగాల్సిన సాగునీటి సంఘాల ఎన్నికలను అనూహ్యంగా ఆఖరి నిముషంలో వాయిదా వేశారు. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ నెల ఐదో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. అదే రోజు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి జనరల్‌బాడీ సమావేశాలు ఎక్కడ నిర్వహించేది ప్రకటిస్తారు. ఎన్నికలకు సంబంధించి టాంటాం ద్వారా గ్రామాల్లో తెలియపరుస్తారు. ఎనిమిదో తేదీన వాటర్ యూజర్స్ అసోసియేషన్ ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణ సాగుతోంది. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ఎన్నిక సైతం అదే రోజు జరుగుతుంది. 11న డిస్ట్రిబ్యూటరీ కమిటీ, 14న ప్రాజెక్టు కమిటీల ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ దగ్గర పడటంతో జలవనరుల శాఖ అధికారులు ఏర్పాట్లలో మునిగి తేలుతున్నారు.

ఎన్నికల ప్రక్రియ జరిగేది ఇలా..

సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ఎటువంటి ఇబ్బందీ లేకుండా ముగిసేలా అధికారులు అన్ని చర్యలూ తీసుకుంటున్నారు. ఏలూరు జిల్లాలో మేజర్–92, మైనర్–251, మీడియం–11 మొత్తం 354 వాటర్ యూజర్ అసోసియేషన్స్ ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఆయా ప్రాదేశిక నియోజకవర్గాల్లో మొత్తం 2,31,311 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 1,53,333 మంది, మహిళా ఓటర్లు 77,978 మంది ఉన్నారు. ఓటర్లయిన రైతులంతా కలిసి వాటర్ యూజర్స్ అసోసియేషన్ (డబ్ల్యుయుఎ) సభ్యులను ఎన్నుకుంటారు. మేజర్, మీడియం వాటర్ యూజర్స్ అసోసియేషన్ కమిటీలో 12 మంది సభ్యులు ఎన్నికవుతారు. మైనర్ వాటర్ యూజర్స్ అసోసియేషన్‌లో ఆరుగురు సభ్యులు ఎన్నికవుతారు. ప్రతి కమిటీ నుంచి ఎన్నికైన సభ్యులంతా అందులో ఇద్దరిని ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకుంటారు. యూజర్స్ అసోషియేషన్ ప్రెసిడెంట్లుగా ఎన్నికైన వారంతా ఏలూరు జిల్లాలోని 14 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు సంబంధించిన ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లను ఎన్నుకుంటారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ ప్రెసిడెంట్లంతా కలిసి తమ్మిలేరు, ఎర్రకాలువ రెండు ప్రాజెక్టు కమిటీలకు సంబంధించిన ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు. పశ్చిమగోదావరి జిల్లాలో మేజర్ వాటర్ యూజర్స్ అసోసియేషన్స్ ప్రాదేశిక నియోజకవర్గాలు 98, మైనర్ 14 ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 14, ప్రాజెక్టు కమిటీ ఒకటి ఉంది. ఈ జిల్లాలో మొత్తం 3.29 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో లక్షా 20 వేల మంది మహిళా ఓటర్లు, పురుష ఓటర్లు 2.09 లక్షల మంది ఉన్నారు. వీరంతా వాటర్ యూజర్స్ అసోసియేషన్ కమిటీలను ఎన్నుకుంటారు. వారు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఓటర్లు చేతులెత్తే ప్రక్రియ ద్వారా ఎన్నిక నిర్వహిస్తారు. ఎక్కడైనా గందరగోళం ఏర్పడి ఎన్నిక జరగకపోతే ఉన్నతాధికారులు తీసుకునే నిర్ణయం ప్రకారం ముందుకు సాగుతారు.

కూటమిలో పదవుల పంపకం పూర్తి

సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే కూటమిలో పదవుల పంపకం పూర్తయ్యిందని చెప్పొచ్చు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సాగునీటి సంఘాలు, సహకార సంఘాల పదవులపై గ్రామాల్లో ఒక ఒప్పందానికి వచ్చిన పరిస్థితి ఉంది. దీంతో అనధికారికంగా నీటిసంఘాల కమిటీలకు సంబంధించి ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ పదవులతోపాటు, సభ్యుల ఎంపిక జరిగిపోయింది. ఇప్పుడు అదే నాయకులు ఎన్నికల్లో పోటీ చేసి పదవులు చేపట్టనున్నారు. వైసిపి నుంచి ఈ పోటీలో పాల్గొనేందుకు నాయకులు ముందుకు రాని పరిస్థితి కనిపిస్తోంది. వైసిపి జిల్లా నాయకత్వం సైతం సాగునీటి సంఘాల ఎన్నికలపై దృష్టి సారించని పరిస్థితి ఉంది. దీంతో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ అంతా లాంఛనప్రాయంగానే సాగనుంది.

ఎన్నికల షెడ్యూల్ ఇలా..

- 5వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ జారీ, అదేరోజు జనరల్ బాడీ సమావేశాలు ఎక్కడ నిర్వహించేది ప్రకటన, గ్రామాల్లో ఎన్నికలకు సంబంధించి టాం.. టాం
- 8వ తేదీ ఎన్నికల ప్రక్రియ. అదేరోజు ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ఎన్నిక
- 11వ తేదీన డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు
- 14న ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు

ఏలూరు జిల్లా వివరాలు..

మేజర్ వాటర్ యూజర్స్ అసోసియేషన్లు–92
మీడియం వాటర్ యూజర్స్ అసోసియేషన్లు–11
మైనర్ వాటర్ యూజర్స్ అసోసియేషన్లు–251
డిస్ట్రిబ్యూటరీ కమిటీలు–14
ప్రాజెక్టు కమిటీలు–2
ఓటర్లు మొత్తం–2,31,311 మంది
పురుష ఓటర్లు–1,53,333
మహిళా ఓటర్లు–77,978

అసలే చలి.. ఆపై వర్షం..!

తేలుతున్న చేపలు – ఆందోళనలో ఆక్వా రైతులు

ప్రజాశక్తి – ముదినేపల్లి




పేరూరు చెరువులో తేలిన చేపలు

వాతావరణంలో మార్పులతో కురుస్తున్న వర్షం వల్ల చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ కొరత ఏర్పడటంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి. మండలంలో 10 వేల ఎకరాలకుపైగా చెరువుల్లో రైతులు చేపల సాగు చేస్తున్నారు. తుపాన్ ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షాలకు పలు గ్రామాల్లోని చేపల చెరువుల్లో ఆక్సిజన్ లోపించి చేపలు మృత్యువాత పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది సాగునీటి కొరతతో చెరువులకు నీరుతోడే అవకాశం లేకుండాపోయింది. చెరువుల్లో నీటిమట్టం తగ్గడంతో నీరు పసర్లతో నిండి చిక్కబడుతుంది. దీంతో చేపలకు వ్యాధులు సోకి మృత్యువాత పడి నీటిపై తేలుతున్నాయి. ఆక్సిజన్ లోపం నివారణకు మందులు వాడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. చెరువుల్లో చనిపోయిన చేపలను గట్లపై గుట్టలుగా వేస్తున్నారు. చేపలు చనిపోయి నీటిపై తేలుతుంటే చూస్తూ ఊరుకోవడం తప్ప చేసేదేమీ ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. రైతులు చెరువుల్లో ఏరియేటర్స్ నిరంతరం తిప్పుతూ చేపలను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి – బుట్టాయగూడెం



వినతి అందిస్తున్న సిబ్బంది

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన సిబ్బంది సోమవారం స్థానిక ఆసుపత్రి సూపరింటెండెంట్ వసుంధరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ బుట్టాయిగూడెం ఏరియా ప్రభుతాసుపత్రిలో కాంట్రాక్ట్ ఏజెన్సీ ద్వారా ఆరుగురు సిబ్బంది పని చేస్తున్నారన్నారు. వారు చాలాకాలంగా నామమాత్రపు వేతనాలతో పని చేస్తున్నారని తెలిపారు. ఆ అరకొర జీతాలు సైతం సకాలంలో రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి నెలా ఒకటో తేదీ నాటికి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఐదు నెలల బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని, సిబ్బందికి సంవత్సరానికి మూడు జతలు యూనిఫారాలు ఇవ్వాలని, పని భారానికి అనుగుణంగా సిబ్బంది సంఖ్యను పెంచాలని, జిఒ నెం.36 ప్రకారం రూ.21 వేతనం ఇవ్వాలని, సూపర్‌వైజర్ జీతం రూ.24 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణ, సత్యవతి, సుందరమ్మ, సుజాత, లక్ష్మి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో నాణ్యత కీలకం

పిజిఆర్ఎస్‌లో 248 అర్జీలు స్వీకరణ
కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి – ఏలూరు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు సంబంధించి అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానమిస్తూ పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.ముక్కంటి, కె.భాస్కర్, మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌తో కలిసి ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ 248 అర్జీలు వచ్చాయన్నారు. ప్రతి అర్జీని ఆడిటింగ్ చేస్తామని, ప్రజల నుండి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షిస్తామని, అర్జీలు రీఓపెన్ అయితే కారణాలను వివరించాల్సి ఉంటుందని అన్నారు. జిల్లా అధికారులు సొంత లాగిన్‌ను ఓపెన్ చేసి ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత కనబరచాలని, అర్జీలు రీఓపెన్ కాకుండా అధికారులు శ్రద్ధ వహించాలని సూచించారు.

అందిన అర్జీల్లో కొన్ని

ఏలూరు రాజేశ్వరి నగర్‌కు చెందిన గుత్తికొండ వెంకటరామారావు అర్జీనిస్తూ డ్రెయిన్ వాటర్, వర్షపు నీరు సరైన పారుదల లేక తమ కాలనీలో దోమలు చేరుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని కోరారు.

మండవల్లి మండలం కానుకొల్లుకు చెందిన పి.మీనాకుమారి అర్జీనిస్తూ గ్రామంలో మంచినీటి బావి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

నిడమర్రు మండలం ఛానమిల్లికి చెందిన సంకు నాగ రామాంజనేయులు తమ వ్యవసాయ భూమి పక్కన చేపల చెరువు తవ్వడం వల్ల తమ చేనుకు తీవ్ర నష్టం కలుగుతుందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బాబు ష్యూరిటీ – వీరబాదుడు గ్యారెంటీ

వైసిపి జిల్లా అధ్యక్షులు డి.నాగేశ్వరరావు విమర్శ

ప్రజాశక్తి – ఏలూరు సిటీ

బాబు ష్యూరిటీ–వీరబాదుడు గ్యారెంటీ అని ప్రజలకు బాగా అర్థమైందని వైసిపి జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి చంద్రబాబు ప్రజలను మోసగించారని నాగేశ్వరరావు విమర్శించారు. కరెంటు ఛార్జీలు పెంచబోనని చెప్పి ఆరు నెలల్లోనే మాట తప్పి భారాలు మోపుతున్నారన్నారు. కూటమి అధికారం చేపట్టగానే బాదుడే బాదుడు కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఎన్నికల ప్రచారంలో కరెంటు ఛార్జీలు తగ్గిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే రెండోసారి ట్రూఅప్ ఛార్జీల పేరిట భారాలు మోపడం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుతం కరెంటు ఛార్జీలు, కూరగాయలు, నూనెలు, బియ్యం, పప్పు దినుసుల ధరలు అధికంగా పెరిగిపోయాయన్నారు. దీంతో ప్రజలు బతకడానికి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి కాల్‌మనీ వేధింపులకు గురవుతున్నారన్నారు. తల్లికి వందనం ఏమైందో చెప్పాలని నిలదీశారు. ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.జయప్రకాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ ఏఒక్క హామీనీ సంపూర్ణంగా అమలు చేయలేదన్నారు.

'సారథి' ద్వారా డ్రైవింగ్ లైసెన్స్‌ల మంజూరు


ప్రజాశక్తి – ఏలూరు స్పోర్ట్స్

ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు రవాణా శాఖ మరో అడుగు ముందుకేసి వాహన్ అప్లికేషన్‌లో వాహనాల వివరాలు, సేవలు పొందుపరచడమే కాకుండా దేశవ్యాప్తంగా సారథి అప్లికేషన్ ద్వారా వాహన చోదకులకు డ్రైవింగ్ లైసెన్స్‌లు మంజూరు చేస్తున్నామని జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం తెలిపారు. దేశవ్యాప్తంగా ఒకటే అప్లికేషన్లో రవాణా శాఖ కార్యకలాపాలు నడుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రత్యేకంగా డ్రైవింగ్ లైసెన్సులను వాహన చోదకులకు ఇచ్చేందుకు సారథి అనే అప్లికేషన్ వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఇ–వాహన్‌లో 85 రకాల రవాణా శాఖ సేవలు, కార్యకలాపాలు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. వాహనాల యజమాని బదిలీ, ఎన్ఒసి సర్టిఫికెట్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, చిరునామా బదిలీ సర్టిఫికెట్లు, ఎల్ఎల్ఆర్‌లు, ఫైనల్ డ్రైవింగ్ లైసెన్సులు, ట్యాక్స్ వంటివి ప్రస్తుతం వాహన్‌లోనే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మిగిలిన సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడానికి మరో వారం రోజులు సమయం పడుతుందని పేర్కొన్నారు.

మహిళల హక్కుల కోసం పోరాడిన అనసూయమ్మ

వర్ధంతి సభలో ఐద్వా, వ్యకాస నేతలు

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్



మాట్లాడుతున్న వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగరాణి

మహిళా కూలీల సమస్యల పరిష్కారంకై నిరంతరం శ్రమించిన నేత అన్నే అనసూయమ్మ అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.శివ నాగరాణి అన్నారు. సోమవారం స్థానిక అన్నే భవనంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో అన్నే అనసూయమ్మ ఏడవ వర్ధంతి సభ తామా ముత్యాలమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా అన్నే అనసూయ చిత్రపటానికి వి.శివనాగరాణి, ఎ.శ్యామల రాణి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహిళా వ్యవసాయ కార్మికుల సమస్యలు, పరిష్కార మార్గాలు అనే అంశంపై జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మహిళా వ్యవసాయ కార్మికులు, మహిళలపై జరుగుతున్న దాడులు, అంశాలపై తీర్మానాన్ని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామల రాణి ప్రవేశపెట్టగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మడకం సుధారాణి బలపరిచారు. ఈ సదస్సుకు హాజరైన వక్తలు వి.శివనాగరాణి, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలరాణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ మాట్లాడుతూ అన్నే అనసూయమ్మ ప్రజా సమస్యలపైన, కార్మికుల హక్కులపైనా, మహిళల సమస్యలపై నిరంతరం పని చేశారని, ఆమె చేసిన కృషి వెలకట్టలేదన్నారు. ప్రధానంగా మహిళా, వ్యవసాయ కార్మికులు, ఒంటరి మహిళలు, మహిళపై జరుగుతున్న అత్యాచారాలు, మద్యం పాలసీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున జిల్లాలో ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని వ్యవసాయ కార్మిక సంఘానికి జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ మహిళా సంఘం ఏర్పాటుకు కృషిచేశారని తెలిపారు. ఆమె ఆశయ సాధన కోసం తాము నిరంతరం ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. కూలీ రేట్లు, ఉపాధి కూలీల సమస్యలపై, మహిళలు, డ్వాక్రా మహిళల సమస్యలు, మహిళా హక్కులు తదితర మహిళా సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించడమే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఆమె ఉద్యమ స్ఫూర్తిని మహిళలు, యువత అందిపుచ్చుకోవాలని కోరారు. రాబోయే కాలంలో ఈ జిల్లాలో ప్రజా సమస్యలతో పాటు ప్రత్యేకంగా మహిళలు, వారి హక్కులు, వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న మహిళల సమస్యలు, మహిళా కూలీ రేట్లు సమస్య వంటి వాటిపై వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా ఐక్య కార్యాచరణ ఉద్యమాలకు పూనుకుంటుందన్నారు. రాబోయే కాలంలో ప్రజా ఉద్యమంలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కారం దుర్గ, మేడిపల్లి హెూలీ మేరీ, బుద్దుల రామలక్ష్మి, గంగాభవాని, చల్లాలాజరమణి, ఏసు మణి, దివినమ్మా, లక్ష్మి, ఐద్వా జిల్లా నాయకులు శారద, హరీషా దుర్గ పాల్గొన్నారు.

సాయుధ దళాల పతాక నిధికి విరాళాలివ్వండి

కలెక్టర్ వెట్రిసెల్విచే కార్ ఫ్లాగ్స్, స్టిక్కర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి – ఏలూరు



స్టిక్కర్లు ఆవిష్కరించిన కలెక్టర్, అధికారులు

దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాలకు, దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో అహర్నిశలు విధులు నిర్వర్తిస్తున్న సైనికులకు, మాజీ సైనికుల సంక్షేమానికి సాయుధ దళాల పతాక నిధికి ప్రజలంతా విరాళాలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జిల్లా సైనిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సాయిధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని రూపొందించిన స్టిక్కర్లు, కార్ ఫ్లాగ్స్, కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. సాయుధ దళాల పతాక దినోత్సవం ప్రాధాన్యత, సైనిక సంక్షేమ నిధికి విరాళాల సేకరణ అంశాలపై జిల్లా సైనిక సంక్షేమ అధికారి ప్రసాదరావు ఈ సందర్భంగా వివరించి కరపత్రాలను అందించి, విరాళాల సేకరణకు జిల్లా అధికారుల సహకారాన్ని కోరారు. అనంతరం కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలు సాయుధ దళాల్లో పని చేస్తున్న సైనికులకు సంఘీభావాన్ని ప్రకటించి విరాళాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలు విజయవంతం చేయాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి – ముదినేపల్లి

మండలంలోని శింగరాయపాలెం – చేవూరుపాలెం సెంటర్లో వేంచేసియున్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి షష్ఠి కళ్యాణ మహోత్సవాలు విజయవంతం చేయాలని ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ కోరారు. దేవస్థానం ప్రాంగణంలో సోమవారం షష్ఠి ఉత్సవాల నిర్వహణపై ఆర్‌డిఒ అధ్యక్షతన సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6 నుంచి 18వ తేదీ వరకు జరిగే స్వామివారి షష్ఠి కళ్యాణ మహోత్సవాలను అధికారులంతా కలిసి సమన్వయంతో పనిచేసి, విజయవంతం చేయాలన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నలుమూలల నుంచి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో మండల తహశీల్దార్ సుభాని, ఎస్ఐ విఎస్.వీరభద్రరావు, ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి, దేవస్థానం మాజీ ఛైర్మన్ పరసా విశ్వేశ్వరరావు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, దేవస్థానం సిబ్బంది, పంచాయతీ, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాయాప్‌కు ఆర్‌జియుకెటి విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నూజివీడు టౌన్ : నూజివీడు ఆర్‌జియుకెటి శ్రీకాకుళం క్యాంపస్‌లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో నాలుగో సంవత్సరం చదువుతున్న బి.సంజయ్, ఎం.భవ్యశ్రీ, విద్యార్థులు, 'సర్కిల్ యాప్ ఆన్‌లైన్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్'(ప్రజా యాప్)కు ఎంపికయ్యారు. వీరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా 6 నెలల పాటు ఇంటెన్షిప్ చేయనున్నారు. ఈ ఆరు నెలల పాటు నెలకు రూ.30 వేలు స్టైఫండ్‌గా పొందనున్నారు. ఇంటెన్షిప్ పూర్తయిన అనంతరం వీరు ఫుల్ టైం సాఫ్ట్‌వేర్ డెవలప్మెంట్ ఇంజనీర్లుగా బెంగళూరులో నియమింపబడి, సంవత్సరానికి రూ.16 లక్షల జీతం అందుకోనున్నారు. ఈ ఘనత సాధించినందుకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్, సెంట్రల్ డీన్ డి.శ్రావణి, డిప్యూటీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎస్.సతీష్‌కుమార్, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలి

ఏజెన్సీ ప్రాంతాల చట్టాలను పరిరక్షించాలి

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు రామకృష్ణ

ప్రజాశక్తి – బుట్టాయగూడెం

మండల కేంద్రంలో అక్రమంగా నిర్మాణాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోమని కోరుతున్న వారిపై ఎదురు దాడి చేస్తున్న తహశీల్దార్, విఆర్ఒ, గ్రామ పంచాయతీ అధికారుల వైఖరి చాలా దారుణంగా ఉందని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు తెల్లం రామకృష్ణ అన్నారు. బుట్టాయగూడెంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న 1/59, 1/70 చట్టాలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ అక్రమదారులపై ఎటువంటి చర్యలు చేపట్టకపోగా, ఫిర్యాదుదారులపై ఎదురు ప్రశ్నలు వేస్తున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతాల చట్టాలు రక్షించాల్సిన అధికారులు మీకు ఎటువంటి సంబంధం లేదని వాదన చేయడాన్ని చూస్తుంటే విడ్డూరంగా ఉందన్నారు. అధికారులు ఈ రకంగా వ్యవహరించడం సరికాదన్నారు. అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిపైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అధికార, ప్రతిపక్ష నాయకుల కనుసందల్లోనే ఈ నిర్మాణాలు జరుగుతున్నాయని, దీనిపైన ఇప్పటివరకు కనీసం స్పందించకపోవటం బాధాకరమని అన్నారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. అక్రమ నిర్మాణదారులు బహుళ అంతస్తుల భవనాలు, షాపింగ్ మాల్స్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చట్టాలకు విరుద్ధంగా జరుగుతున్నప్పటికీ కనీసం పట్టించకపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని అక్రమ నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు చేపట్టాలని, క్రిమినల్ కేసులు కూడా పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు పోలోజు నాగేశ్వరావు, కారం భాస్కర్ రావు, ఉడతా వెంకటేశ్వరరావు ఉన్నారు.

అభయపై విస్తృత అవగాహన

ప్రజాశక్తి – ఏలూరు స్పోర్ట్స్

అభయ అంటే మహిళలు తమకు అభయంగా భావించాలనే ముఖ్య ఉద్దేశంతో అభయపై విస్తృత అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నామని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుబ్బారావు అన్నారు. ఏలూరు నగరంలోని పలు ప్రాంతాలలో అభయపై అవగాహనా కార్యక్రమాలలో భాగంగా సోమవారం రాత్రి అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా బస్టాండ్లు, రైల్వేస్టేషన్లో రద్దీగా ఉండే ప్రాంతాలలో మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుబ్బారావు, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ క్రాంతిప్రియలు సంయుక్తంగా తమ సిబ్బందితో కలిసి విస్తృతంగా అవగాహన కల్పించి, తనిఖీలు కూడా నిర్వహించారు. నగరంలో ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ అభయ టీమ్ సైరన్ల మోత మోగించింది. ఈ సందర్భంగా సిఐ సుబ్బారావు మాట్లాడుతూ అభయ టీమ్ నగరంలో సాయంత్రం నుంచి రాత్రి వరకు సంచరిస్తూ ఆపదలో ఉన్న మహిళలకు అండగా ఉండేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని ఆయన అన్నారు. 112 నెంబర్‌కు ఫోన్ చేసి ఆపదలో ఉన్న మహిళలు, విద్యార్థులు, బాలికలు, వృద్ధులు తమకు కావాల్సిన సహాయాన్ని పొందవచ్చు అని కూడా వారు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుబ్బారావు, ఎస్ఐ క్రాంతిప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు

ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ అన్నారు. సోమవారం నాలుగు మండలాలలో జాబ్‌మేళా ఎంపిక శిబిరాలు నిర్వహించారు. నిరుద్యోగులతో ముఖాముఖిగా ఇంటర్వ్యూ నిర్వహించి, జాబితాను సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. యువత ఉద్యోగ అవకాశాలు అందుపుచ్చుకుని, తమ కాళ్లపై నిలబడి, కుటుంబానికి అండగా నిలవాలని అన్నారు. చింతలపూడి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉద్యోగ కల్పనకు నిర్వహించిన ముఖాముఖిలో ఎంపిక అభ్యర్థుల తుది జాబితా తయారు చేసి, అర్హులైన వారికి ఆయా కంపెనీల్లో ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు.

'కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి'

ప్రజాశక్తి - మండవల్లి

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ స్పష్టం చేశారు. మండవల్లి స్టేషన్ రోడ్డులో రూ.6 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన కార్యకర్తలు, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని గాలికి వదిలేసిందన్నారు. దీంతో రాష్ట్రంలోని రహదారులన్నీ నాశనం అయిపోయాయని, గ్రామాలలోని రోడ్లపై కూడా ప్రజలు నడవలేని పరిస్థితి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, నిధులను మంజూరు చేసి, నిర్మిస్తూ, రహదారుల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, సర్పంచి మెండ ఝాన్సీ, గుడివాడ చిట్టిబాబు, బాలాజీ, చేపత్తిన విజయ్, ముల్లపూడి సత్తిబాబు పాల్గొన్నారు.

8న ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ముసునూరు

ఈనెల 8వ తేదీన నూజివీడులో జరగనున్న మాదిగల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళన కలయికను విజయవంతం చేయాలని మాదిగ ఐక్య కార్యాచరణ సమితి నియోజకవర్గ కన్వీనర్ కొండేటి ఉదయ్ కిరణ్, కో కన్వీనర్ గద్దల మోహనరావులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో విలేఖరులతో మాట్లాడుతూ మాదిగల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే మాదిగల ఆత్మీయ కలయిక సమ్మేళనాన్ని మండల పరిధిలోని 16 గ్రామ పంచాయతీ పరిధిలోని మాదిగలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కంచర్ల లవ కుమార్, ముళ్లపూడి రామారావు, దుబ్బాక దేవరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమడోలు: భీమడోలు 220/132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం నిర్వహించనున్న మరమ్మతు పనుల కారణంగా మండలంలోని కొన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో భీమడోలు ఎడిఇ గోపాలకృష్ణ తెలిపారు. దీనిలో భాగంగా పాడైపోయిన కండక్టర్ల స్థానంలో నూతన కండక్టర్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈమేరకు ఉదయం 8:30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. 11 కేవీ గుండుగొలను, పారిశ్రామిక ఫీడర్, నాగ హనుమాన్ ఫ్యాక్టరీ ఫీడర్, సూరప్ప గూడెం, వ్యవసాయ, మెయిన్ ఫీడర్లు, పొలసానిపల్లి వ్యవసాయ ఫీడర్‌తో పాటు సూరప్ప గూడెం, పాతూరు, దిగుడుపాటి దిబ్బ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాలలోని విద్యుత్ వినియోగదారులు ప్రత్యామాయ ఏర్పాట్లు చేసుకోవాలని ట్రాన్స్‌కో భీమడోలు ఎడిఇ విజ్ఞప్తి చేశారు.

శ్యామ్, రాజుకు సన్మానం

మండవల్లి : ప్రాణాపాయస్థితిలో ఉన్న వ్యక్తిని ఆసుపత్రిలో చేర్పించి, ప్రాణాలను నిలిపి మానవత్వాన్ని చాటుకున్న ఇరువురు వ్యక్తులను మండవల్లి పోలీసులు స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లింగాల గ్రామానికి చెందిన కాటి నిరీక్షణ బాబు కానుకొల్లులో ఉన్న చెరువుల వద్దకు వెళ్లడానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యలో వాహనం అదుపుతప్పి కింద పడడంతో తలకు బలమైన గాయమై, తీవ్ర రక్తస్రావం అయ్యి, ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా మండవల్లికి చెందిన కందుల శ్యామ్, నల్గొండ రాజు టాటా ఎసి కొత్త వాహనాన్ని కొనుగోలు చేసి, విజయవాడలోని కనకదుర్గమ్మ గుడిలో పూజలు చేయించి తిరిగి ఇంటికి వస్తుండగా.. మార్గంలో పోలీసులు పరిస్థితిని వివరించి హాస్పిటల్‌కి తీసుకు వెళ్లాల్సిందిగా కోరారు. దీంతో మానవత్వంతో స్పందించిన శ్యామ్, రాజులు కుటుంబ సభ్యులను వేరే ఆటోలో ఇంటికి పంపించి, బాధితుడిని తన కొత్త వాహనంలో ఎక్కించుకొని గుడివాడలోని ఆసుపత్రికి తరలించారు. దీంతో బాధితుడు ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. ఆపద సమయంలో అండగా నిలిచిన వారిరువురిని బాధిత కుటుంబ సభ్యులతోపాటు పలువురు అభినందించారు. వారిని ఆదివారం సాయంత్రం పోలీసులు ఘనంగా సన్మానించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ఇలానే సహృదయంతో స్పందిస్తే ప్రమాదం సంభవించి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తుల ప్రాణాలను కాపాడవచ్చునని ఎస్ఐ రామచంద్ర రావు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సెమీ క్రిస్మస్ వేడుకలకు వెళ్లి వస్తానని చెప్పిన వ్యక్తి రైలు పట్టాలు దాటుతూ, రైలు ఢీకొని మృతిచెందిన ఘటన ఏలూరు రైల్వే స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్ తెలిపిన వివరాల ప్రకారం కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం గారపాడు గ్రామానికి చెందిన జంపన గగన్(32) స్థానికంగా కూలీ పనులు చేస్తూ కుటుంబంతో కలిసి జీవనాన్ని సాగిస్తున్నాడు. ఇంటి వద్ద నుంచి సెమీ క్రిస్మస్ వేడుకలకు వెళ్లి వస్తానని చెప్పి బయలుదేరాడు. వీరవల్లి గ్రామంలో ఉన్న రైలు పట్టాలను దాటుతున్న సమయంలో గుర్తు తెలియని రైలు బండి గగన్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. రైల్వే ఎస్ఐ సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

కొయ్యలగూడెం : మండలంలోని అచ్యుతాపురం గ్రామ శివారులోని హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద జరిగిన దారుణ రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం అచ్యుతాపురం గ్రామ శివారులోని హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద ఉదయం 6 గంటల ప్రాంతంలో ట్రాక్టర్ రోడ్డు పక్కన ఏ సిగ్నల్ లేకుండా ఆగి ఉండడంతో వెనుక నుంచి వస్తున్న కూరగాయల వ్యాపారి జక్కు గంగరాజు తన టివిఎస్ ఎక్సెల్‌తో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గంగరాజును వెంటనే గోపాలపురం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. మృతుడిని మంగపతి దేవి పేట గ్రామస్తుడిగా గుర్తించారు. ఈ ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ గుండాల రమేష్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

రూ.25 వేలు స్వాధీనం

చింతలపూడి : పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని శెట్టివారి గూడెంలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి, ఏడుగురు వ్యక్తుల నుంచి రూ.25 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నాటుసారా పట్టివేత

జీలుగుమిల్లి : మండలంలోని దర్భగూడెం గ్రామ పరిసర ప్రాంతాలలో సోమవారం పోలీసులు తనిఖీలు చేస్తుండగా గ్రామానికి చెందిన మహిళ పోలీసులను చూసి పారిపోతుంటే పట్టుకొని తనిఖీ చేశారు. ఆమె వద్ద ఉన్న సంచిలో 08 లీటర్ల నాటు సారాను గుర్తించినట్లు హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరావు తెలిపారు. నాటు సారాను స్వాధీనం చేసుకొని, మహిళపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

నూజివీడు టౌన్ : మండలంలోని గొల్లపల్లి గ్రామంలో జరిపిన దాడులలో 05 లీటర్ల నాటు సారాని స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ మస్తానయ్య తెలిపారు. నేరస్థలం నుంచి పారిపోయిన కందుల సాంబ శివరావు తండ్రి వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రహరీ గోడ నిర్మించాలి

సిపిఎం ఆధ్వర్యాన నగరపాలక సంస్థ కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పంగడిగూడెం రోడ్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ ప్రహరీ గోడ ర్యాంపు నిర్మాణం వెంటనే చేపట్టి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతూ నగర పురపాలక సంస్థ కమిషనర్ వెంకటరమణకు, పదో వార్డు కౌన్సిలర్ తెల్లగారపు జ్యోతికు సిపిఎం ఆధ్వర్యాన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎస్‌కె.మాబు సుభాని మాట్లాడుతూ ఎంతో వ్యయంతో నిర్మించిన ఈ ఆరోగ్య కేంద్రాన్ని నిర్వీర్యం చేయకుండా పేద ప్రజలకు వైద్య సేవలు అందించడానికి ఉపయోగించాలని అన్నారు. నాలుగు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే ర్యాంపు, ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలన్నారు. ఎంతో ప్రజాధనంతో ఏర్పడిన ప్రభుత్వ ఆస్తులను సంరక్షిస్తూ, ఈ ఆరోగ్య కేంద్రం ద్వారా పేద ప్రజలకు వెంటనే వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కమిటీ సభ్యులతో కమిషనర్ మాట్లాడుతూ ర్యాంపు నిర్మాణం పూర్తి చేసి, ప్రజలకు వైద్య సేవలు అందించే విధంగా చేస్తామన్నారు. ఈనెల 12వ తేదీన కౌన్సిల్ సమావేశంలో మాట్లాడి ప్రహరీ గోడ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. 10వ వార్డు కౌన్సిలర్ జ్యోతి మాట్లాడుతూ ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వల్ల పట్టణ, 9, 10 వార్డు దగ్గర గ్రామాలైన పేరంపేట, నాగులగూడెం, పంగిడిగూడెం, బాట గంగానమ్మ లేఅవుట్, పైడిపాక రామయ్యపేట కాలనీ వాసులందరికీ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, పేద ప్రజలకు వైద్య సేవలు అందించడానికి ఈ ఆరోగ్య కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు వంగా గోపి, కార్యకర్తలు మునుపరతి ప్రసాద్, పాకిరం ఏడుకొండలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో లింగవివక్షపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


మాట్లాడుతున్న సిఐ క్రాంతిప్రియ

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నవంబర్ 25 నుంచి డిసెంబర్ 23 వరకు నిర్వహిస్తున్న నేషనల్ జెండర్ కాంపెయిన్ - చేతన - 3.0లో భాగంగా లింగ వివక్షతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ పురుషులతో పాటు సమానంగా రాణిస్తున్న స్త్రీలను తక్కువ చేసి చూడడం తగదని, లింగ వివక్షత అనాగరికమన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ వి.క్రాంతి ప్రియ మాట్లాడుతూ అనేక రకాలుగా స్త్రీలపై జరుగుతున్న హింసను నిరసిస్తూ, అలాంటి సంఘటనలు జరిగినప్పుడు తెలియజేయాల్సిన టోల్ ఫ్రీ నెంబర్స్‌ను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం కార్యక్రమాన్ని సమన్వయం చేసిన వృక్షశాస్త్ర అధ్యాపకులు టివిఎస్.పద్మావతి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రాంబాబు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు వి.వెంకట్రావు, ఎస్.పరమేష్, టి.వెంకట దుర్గాప్రసాద్, ఎస్.సుస్యలత, డి.సుజాత పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలు వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి

ముదినేపల్లి : చేపల సాగుకు కోళ్ల వ్యర్థాలు వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండల తహశీల్దార్ సుభాని, ఎంపిడిఒ రామకృష్ణలకు వినతి పత్రం అందించారు. మండలంలోని పేరూరులో 12 ఎకరాల్లో పలువురు వ్యక్తులు కోళ్ల వ్యర్థాలతో చేపల సాగు చేస్తున్నారు. ఆ వ్యర్థాలతో సాగు చేస్తున్న చేపలు స్వాధీనం చేసుకుని, చేపలను నాశనం చేసి, ప్రజారోగ్యాన్ని కాపాడాలని బిజెపి యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మొవ్వ ఫణీంద్ర అధికారులకు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. దీనివల్ల జల, వాయువు, పర్యావరణం కాలుష్యం పెరుగుతుందన్నారు. దీనిపై ఇటీవల ఆ చేపల చెరువులోని కోళ్ల వ్యర్థాలను అధికారులు తొలగించారని, వ్యర్థాలతో సాగుచేసిన చేపలను మాత్రం అలాగే వదిలేసారన్నారు. ఆ వ్యర్థాలతో సాగు చేసిన చేపలను తినే ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. ప్రజారోగ్యం దృష్టిలో పెట్టుకుని, ప్రజారోగ్యంతో చెలగాటమాడుతూ, చేపల సాగు చేస్తున్న సాగుదారులపై కేసు నమోదు చేయాలని, ఆ చేపలను ధ్వంసం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

గ్రంథాలయం ఏర్పాటు చేయాలని అర్జీ

ఉంగుటూరు : నారాయణపురంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు మెండ్యాల నాగేశ్వరరావు సోమవారం మీకోసంలో జిల్లా కలెక్టరుకు అర్జీ ఇచ్చారు. ప్రపంచానికి కిటికీ వంటిదైన గ్రంథాలయం తమ గ్రామంలో లేకపోవడంతో ముఖ్యంగా విద్యార్థులు, పోటీ పరీక్షలకు హాజరుకావాల్సిన నిరుద్యోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రంథాలయం ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించాలని అర్జీలో కోరినట్లు నాగేశ్వరరావు విలేకర్లకు వెల్లడించారు.

కిశోర బాలికల వికాసంపై అవగాహన

ముసునూరు : బాలికలకు యుక్త వయసు రాకపోయినా వయసుతో సంబంధం లేని పురుషులు అభాగ్యుల ప్రాణాలపై చెలగాటమాడుతున్నారని ఎంపిడిఒ జి.రాణి, ఎంఇఒ బివిఎస్ సుబ్బారావులు పేర్కొన్నారు. సోమవారం మండలం కేంద్రమైన మండల పరిషత్ కార్యాలయంలో కిశోర బాలిక వికాసం-2పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ సూపర్వైజర్ ధనలక్ష్మి మాట్లాడుతూ చదువుకునే బాలికలు అబ్బాయిల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. వయసుతో సంబంధం లేని పురుషులు మహిళలు కనిపించినట్లయితే అసభ్యకరమైన పదజాలంతో పాటు, బహిరంగ చేష్టలు చేయడానికి ఇష్టపడే వ్యక్తులు సమాజంలో చాలామంది ఉన్నారన్నారు. ప్రతి ఒక్క ఆడపిల్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: బాలిక వివాహాల విషయంలో మన రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో ఉందని ఎంపిడిఒ కె.కిరణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కిశోర బాలికా వికాసం(2.0) కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. ప్రభుత్వం కిశోర బాలికా వికాసం కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఇందులో 11 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల కౌమార బాలికలకు అవగాహన కల్పించాలని, బాల్య వివాహాలను వ్యతిరేకించాలని తెలిపారు.

ఆర్తో హ్యాండీక్యాప్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సురేష్

మండవల్లి : ఉమ్మడి కృష్ణాజిల్లా ఆర్తో హ్యాండీక్యాప్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మండవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు చెందిన ల్యాబ్ టెక్నీషియన్ ముద్దుల సురేష్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శారీరక వికలాంగుల ఉద్యోగ ఆత్మీయ సమ్మేళనం, ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో స్టేట్ ప్రెసిడెంట్ ఎల్లయ్య చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందించారు. అనంతరం అసోసియేషన్ సిబ్బంది దుశ్శాలువ, పూలమాలతో మెమొంటో అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్తో హ్యాండీక్యాప్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు అందుబాటులో ఉంటూ, ఎంప్లాయిస్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం అయ్యే దిశగా చర్యలు తీసుకుంటానన్నారు. మండవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు.

ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని వినతి

ఏలూరు అర్బన్ : నవంబర్ 25వ తేదీన ద్వారకాతిరుమల ఎంపియుపి పాఠశాలలో విద్యార్థులను తీవ్రంగా కొట్టి, హింసించిన లెక్కల మాస్టారు ముత్యాలరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పిడిఎస్‌యు ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు సోమవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కె.నాని మాట్లాడుతూ సదరు ఉపాధ్యాయుని దాష్టీకంపై నవంబర్ 25న ద్వారకా తిరుమల మండల విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేయగా ఇప్పటి వరకు ఎలాంటి చర్య తీసుకోలేదని, పోలీస్ స్టేషన్లో ఉపాధ్యాయునిపై ఫిర్యాదు చేసినప్పటికీ నేటి వరకు కేసు నమోదు చేయలేదని చెప్పారు. విద్యార్థులను తీవ్రంగా కొట్టడమే కాక కులం పేరుతో దూషించిన ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బాధిత విద్యార్థులు గుండే త్రివిక్రమ్, గుండే సహస్ర, తండ్రి ధర్మరాజు పాల్గొన్నారు.

తుపాన్ ప్రభావంతో రైతుల్లో ఆందోళన

ధాన్యం ఒబ్బిడి చేసుకునే పనిలో పడ్డ రైతన్నలు
గోదాములు లేక అవస్థలు
నష్టపోతున్నామని ఆవేదన

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో తుపాను ప్రభావం వల్ల గత రెండు రోజులుగా గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరం, ప్రగడపల్లి, వింజరం, ఇటుకలకోట, ఎల్లండిపేట, కోండ్రుకోట పంచాయతీల పరిధిలోని గ్రామాలలో కురిసిన వర్షానికి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరికోతలు కోసిన రైతులు తమ పంటలను ఒబ్బిడి చేసుకునే పనిలో పడ్డారు. ధాన్యం నిల్వ చేసుకోవడానికి గోదాములు లేక పలు అవస్థలకు గురయ్యారు. బరకాలు కప్పి, రాళ్లు వేసి కళ్లాల వద్ద కాపలా ఉంటున్నారు. మరికొంత మంది రైతులు దళారులు నిర్దేశించిన ధరలకు అమ్ముకుని సొమ్ములు చేసుకుంటున్నారు. గోదాములు లేక ధాన్యం భద్రపరుచుకునే మార్గం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి గోదాముల సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. గోదాములు లేక ప్రతి యేటా రైతులు పంట నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతకు వచ్చిన పంటలు తుపాను ప్రభావం వల్ల నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ధాన్యాన్ని బరకాలు కప్పి ఒబ్బిడి చేసుకున్న రైతులు

రైతులు ప్రీమియం నగదు జమ చేసుకోవాలి

వ్యవసాయాధికారి మధుమోహన్

ప్రజాశక్తి - ముసునూరు

రబీ సీజన్‌లో భాగంగా పంటలు వేస్తున్న మొక్కజొన్న, వరి, పత్తి, మినుము, పెసరు లాంటి పంటలకు పంటల బీమా పథకం కింద రైతు తమ ప్రీమియం నగదు ఆన్‌లైన్‌లో జమ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.మదుమోహన్ పత్రికాముఖంగా తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన వ్యవసాయ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ పైన పేర్కొన్న పలు పంటల్లో అతివృష్టి, అనావృష్టి అనివార్య కారణాల వల్ల పంటలు దెబ్బతిన్నట్లయితే ప్రీమియం చెల్లించిన రైతులకు 80 శాతం పైగా బీమా క్లెయిమ్ జరగబడి రైతులకు లబ్ధి పొందే అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ సీజన్లో ఎక్కువగా మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. కావున మొక్కజొన్న పంటకు ప్రీమియం కింద రూ.483 కామన్ సర్వీస్ సెంటర్‌లో ప్రీమియం చెల్లించినట్లయితే వారికి బీమా సౌకర్యం ఉంటుందన్నారు. ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంటు, రైతు పట్టాదారు, పాస్ పుస్తకం, రైతు అయితే కౌలు కార్డుతో కూడా నమోదు చేయించుకోవచ్చున్నారు. ప్రస్తుతం మండల యూనిట్‌గా పంటల బీమా కొనసాగుతుందని, భవిష్యత్తులో వరిపంట వల్లే మొక్కజొన్న పంట కుడా గ్రామ యూనిటీగా బీమా క్లైమ్ అవుతుందని తెలియజేశారు. రైతులందరూ త్వరతిగతిన ప్రీమియం చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వాటర్ ట్యాంక్ శుభ్రం చేయండి మహాప్రభో!

మురుగు నీరు తాగుతున్నాం
మిథుమిల్లివారి గూడెం గ్రామస్తుల ఆవేదన

ప్రజాశక్తి - చింతలపూడి

నాలుగు నెలలుగా మంచినీటి వాటర్ ట్యాంక్ శుభ్రం చేయటం లేదని, మురికి నీరు తాగుతున్నామని, మంచినీటి వాటర్ ట్యాంక్ శుభ్రం చేయాలని మిథుమిల్లివారిగూడెం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారుగా నాలుగు నెలల క్రితం వాటర్ ట్యాంక్ శుభ్రం చేశారని, ఇప్పటివరకు మరలా శుభ్రం చేయలేదన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి మంచినీటి వాటర్ ట్యాంక్ శుభ్రం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ, కిందిస్థాయిలో పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచినీటి వాటర్ ట్యాంక్ చుట్టూ అపరిశుభ్రంగా ఉందని, పైప్ లైన్ లీకేజీ వల్ల కింద వీధిలోకి బురద నీరు వస్తున్నాయని, అధికారులు త్వరగా పట్టించుకొని సమస్యను పరిష్కరించాలని కోరుకుంటున్నారు. వాటర్ ట్యాంకర్ కింద మురికి గుంటలను పూడ్చాలని, లీక్ అవుతున్న పైపులను మరమ్మతులు చేయించి, మంచినీటి సౌకర్యం అందించాలని ఉన్నతాధికారులను గ్రామస్తులు వేడుకుంటున్నారు.

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

సిపిఎం జిల్లా 26వ మహాసభలు ఈనెల 13, 14, 15 తేదీల్లో బుట్టాయగూడెంలో జరుగనున్నాయని, ఈ మహాసభల నిర్వహణకు, జయప్రదం చేయడానికి వేలేరుపాడు మండల ప్రజలు, ముఖ్యంగా ఏజన్సీ ప్రాంత ప్రజలు సహాయ, సహకారాలు అందించాలని సిపిఎం మండల కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం జిల్లా మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, జిల్లా నాయకులు మడివి దుర్గారావులు మాట్లాడుతూ మహాసభలు భూ పోరాటాలకు నిలయమైన ఏజన్సీ ప్రాంతం బుట్టాయగూడెంలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభల ప్రారంభ రోజు 13వ తేదీన బుట్టాయగూడెంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తామని, 14, 15 తేదీల్లో ప్రతినిధుల సభ జరుగుతుందని వివరించారు. ఈ మహాసభలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం, ఇతర నాయకులు పాల్గొంటారన్నారు. అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కారం వెంకట్రావు, గుమ్మల వెంకట నరసయ్య, సవ్లం లింగయ్య, కొత్త వెంకటేశ్వర్లు, కరటం ప్రకాష్, మాడి ప్రసాద్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రాంబాబు, సత్యం, ఊకె రాజులు పాల్గొన్నారు.

ఎఆర్ డిఎస్‌పి శ్రీహరికి అభినందన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీలలో రన్నరఫ్‌గా నిలిచిన ఎఆర్‌డిఎస్‌పిని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ అభినందించారు. గత నెల 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ ఆధ్వర్యంలో 25వ ఆల్ ఇండియా టెన్నిస్ ఛాంపియన్‌షిప్ 2024 సంవత్సరపు పోటీలను బెంగళూరులో నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా ఎఆర్‌డిఎస్‌పి శ్రీహరి హాజరై రన్నరఫ్‌గా నిలిచారు. సోమవారం ఎస్‌పి ఆయనను జిల్లా పోలీస్ కార్యాలయంలో అభినందించారు.

లింగ వివక్షను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని బుట్టాయగూడెం గ్రామ పంచాయతీలో మహిళల భద్రత, జండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారం నిర్వహించారు. పోలీస్, మహిళా శిశుసంక్షేమశాఖ, గ్రామీణ అభివృద్ధి, పేదరిక నిర్మూలన శాఖ భాగస్వామ్యంతో నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా, స్థానిక డ్వాక్రా సిఎ మందపాటి ఝాన్సీ ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ఆటల పోటీలు

ముసునూరు : అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకుని సోమవారం మండలంలోని రమణక్కపేట గ్రామంలో ఎంపిపి పాఠశాలలో ప్రత్యేక అవసరాల గల పిల్లలకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. వారిలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రకటించి, మంగళవారం మండల విద్యాశాఖ అధికారి బివిఎస్.సుబ్బారావు ఆధ్వర్యంలో బహుమతులు ప్రధానోత్సవ కార్యక్రమం జరుగుతుందని ఆర్‌పిటియు ఉపాధ్యాయులు డిఎంవి.లక్ష్మీనారాయణ, జె.నాగమల్లేశ్వరిలు తెలియజేశారు. విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావేదికను వినియోగించుకోవాలి

నూజివీడు టౌన్ : ప్రజాసమస్యల తక్షణ పరిష్కారంకై నూజివీడు నియోజకవర్గం పరిధిలో జరిగే ప్రజావేదిక కార్యక్రమానికి రాష్ట్ర గృహనిర్మాణ పౌర సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారది శ్రీకారం చుట్టారు. మంత్రి ఆదేశాల మేరకు ఈనెల 3, 4వ తేదీలలో నూజివీడు పట్టణంలో ఉన్న 16 సచివాలయాల్లో, ముసునూరు మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో, చాట్రాయి మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో, ఆగిరిపల్లి మండలంలోని పొన్నం కళ్యాణ మండపంలో, నూజివీడు మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ప్రజల దగ్గర నుంచి అర్జీలను స్వీకరించవలసిందిగా టిడిపి నియోజకవర్గ కార్యాలయ వర్గాలు ఈ సందర్భంగా తెలిపాయి.

ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ ఎంపిక

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన సభ్యుల ఎంపిక సోమవారం వాసవీ ఆడిటోరియంలో నిర్వహించారు. ఇప్పటికే అధ్యక్షునిగా ఎంపికైన మదు మోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వివిధ వ్యాపార, వర్తక కేంద్రాలలోని అన్ని సామాజిక తరగతుల వారికి చాంబర్‌లో ప్రాతినిధ్యం కల్పించామని మోహన్ తెలిపారు.